సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి
- అభివృద్ధి పనుల ప్రారంభం

ముషీరాబాద్‌లో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ లక్ష్మణ్, కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్

ముషీరాబాద్, ఆగస్టు 14: బడ్జెట్ కేటాయింపుల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నగరాన్ని పూర్తిగా విస్మరించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఆరోపించారు. నగర ప్రజల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లో రూ.73 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలో డ్రైనేజీ సమస్యలు, కలుషితనీరు, అధ్వాన్నపు రోడ్లతో ప్రజలు ఇబ్బదులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి శాఖలకు నిధుల కొరతవల్ల ప్రజా సమస్యలను అధికారులు పరిష్కరించలేకపోతున్నారని, ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో వారు ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం నగర అభివృద్ధికి నిధులు కేటాయించపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రోడ్ల సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ 15 డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మోహినుద్దీన్, ఈఈ శ్రీనివాస్, ఏఎంహెచ్‌ఓ మైత్రేయి, బీఆర్‌ఎస్ యూత్ విభాగం నాయకుడు ముఠా జయసింహ, శ్రీధర్ రెడ్డి, ఆకుల అరుణ్, శివముదిరాజ్, దీన్‌దయాల్ రెడ్డి, సుధాకర్ గుప్తా, ముచ్చకుర్తి ప్రభాకర్, బీజేపీ నాయకుడు నవీన్‌గౌడ్, భద్రీనారాయణ, రమేశ్‌రామ్, సీకే శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం

నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ సొసైటీ నేతృత్వంలో శ్రీ శ్రీనివాసుడి కల్యాణం ఘనంగా నిర్వహించారు. తిరుమలతిరుపతి దేవస్థానం అధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన స్వామి వారి కల్యాణంలో ముఖ్య అతిథిగా తెలంగాణ ఐటీ, సమాచార శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణం అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ప్రతినిధులు వనం సత్యేందర్, బి.హన్మంత్‌రావు, చంద్రజిత్‌సింగ్, రాజేందర్ కుమార్ పాల్గొన్నారు. – అబిడ్స్, ఆగస్టు14

వివిధ కోర్సుల ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 14: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) ఎంఆర్ఐ, ఎల్‌డీ, హెచ్ఐ, ఏఎస్‌డీ కోర్సులతో పాటు పీజీడీసీఏ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

బీఈ పరీక్ష తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) అన్ని విభాగాల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, బీఈ (సీబీసీఎస్) అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, బీఈ (నాన్ సీబీసీఎస్) అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, వన్ టైం చాన్స్ పరీక్షలను ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

మంత్రికి ఆహ్వానం..

నగరంలో ప్రసిద్ధి గాంచిన చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలు ఈ నెల 17 నుంచి 19 వరకు జరగనున్నాయి. దేవాలయ కార్యనిర్వాహణాధికారి రామాంజనేయులు బుధవారం ఆటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఈవో రామాంజనేయులు మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు స్వామివారి పవిత్రోత్సవాలు ఘనంగా న్విహించడం జరుగుతుందని తెలిపారు.

– చిక్కడపల్లి, ఆగస్టు 14

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా అవార్డులు అందుకున్న సైంటిస్టులు

అబిడ్స్, ఆగస్టు 14: భారతీయ అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ ఇస్రో ఏర్పాటులో కీలక పాత్ర వహించారని మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ బసర్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రివేంద్రంలోని ఇస్రో శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రివేంద్రం ఇస్రో శాస్త్రవేత్తలు అయిన డాక్టర్ బి. ప్రదీప్ కుమార్, డాక్టర్ శ్రీలత, ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ప్రొఫెసర్ సి. చంద్రశేఖర్, ప్రొఫెసర్ నవీన్ కుమార్‌లకు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ మెమోరియల్ అవార్డు–2024 ను తెలంగాణ సిటిజెన్ కౌన్సిల్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ హై కోర్టు న్యాయవాది గద్దిగూడి ఎల్లయ్య శాలువా, పూల మాల, జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రొ. రామక్రిష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. పి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసం సంకల్ప యాత్ర

లోక కల్యాణం కోసం సంకల్ప యాత్రలో పాల్గొన్న వివిధ మఠాల స్వాములు

కాచిగూడ,ఆగస్టు 14: లోక కల్యాణం కోసం భద్రాద్రి శ్రీ రామటెంపుల్ ఆఫ్ యూఎస్ఏ ఆధ్వర్యంలో అమెరికాలోని జార్జియా రాష్ట్రం అట్లాంటా సిటీలో శ్రీ భద్రాద్రి సీతా రాముల ఆలయ నిర్మాణ సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో శ్రీ త్రిదండ శ్రీమన్నారాయణ చిన్నజీయర్‌స్వామి దివ్య సంకేతంతో 10 మంది అర్చకస్వాములు సంకల్ప దీక్ష తీసుకున్నారు. భారతదేశాన్ని కేంద్రంగా చేసుకొని 8 దిక్కులలోని వివిధ దేశాల్లో శ్రీ సీతారామంజనేయ స్వామి విగ్రహాలతో యాత్ర నిర్వహించి.. సెప్టెంబర్ 17న భద్రాద్రి రామలయంకు చేరుకుని, అక్కడ శాంతి కల్యాణం నిర్వహించడంతో సంకల్ప యాత్ర ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ కాశీవిశ్వనాథం, పాడిచేడి సీతారామచార్యులు, సరిపల్లిరావ్, శైలజ, అరుణ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

జూడా నిందితులను కఠినంగా శిక్షించాలి

ఉస్మానియా మెడికల్ కళాశాలలో నిరసన

ఉస్మానియా మెడికల్ కళాశాల ఆవరణలో నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

సుల్తాన్‌బజార్, ఆగస్టు 14: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాలలో పీజీ రెండవ సంవత్సరం జూనియర్ డాక్టర్ మౌమితా దేబ్ నాథ్‌పై జరిగిన దారుణ హత్యను ఉస్మానియా జూనియర్ డాక్టర్లు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జూడా మైమితా దేబ్ నాథ్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఉస్మానియా జూడాలు డాక్టర్ దీపాంకర్, డాక్టర్ ఇసాక్, డాక్టర్ సురేశ్‌కుమార్, డాక్టర్ రాహుల్, డాక్టర్ చంద్రిక, డాక్టర్ హరిని, డాక్టర్ జగన్, డాక్టర్ ప్రవీణ్‌లు మాట్లాడుతూ .. కోల్‌కతాలో జూడా దారుణహత్య ఘటనలో నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అన్నారు. బాధితురాలికి, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వైద్య నిపుణులతో పాటు మహిళా వైద్యులకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకునేలా కేంద్రం ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చి .. వెంటనే అమలు చేయాలని అన్నారు.

గిరిజన శాఖమంత్రి, హామీలు అమలు చేయాలి

చిక్కడపల్లి,ఆగస్టు14 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా గిరిజన సంక్షేమం శాఖకు మంత్రిని నియమించకపోవడం సామాజిక వివక్షత చూపకపోవడమేనని గిరిజన సంఘాల నాయకులు ఆరోపించారు. ఎన్నికల్లో గిరిజనులకు అనేక హామీలు ఇచ్చి లబ్ధిపొందిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క హామీని కూడా అమలు చేయలేదని వారు ధ్వజమెత్తారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం అధ్యక్షుడు ధర్మానాయక్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాంనాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూడవత్ రాంబాబ్ నాయక్, బీఆర్‌ఎస్ గిరిజన విభాగం సీనియర్ నాయకుడు రూప్‌సింగ్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, ఎల్‌హెచ్‌పీఎస్ రాఖేష్, నాయక్, గుగులోత్ భీమా , సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు నాయక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే గిరిజన హామీలను అమలు చేస్తామని ప్రకటించారని అన్నారు. చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, మ్యానిఫెస్టోలో 16 రకాల వాగ్దానాలను కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో ప్రకటించారని వివరించారు. 9 నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి తక్షణం స్పందించి గిరిజన శాఖకు మంత్రిని నియమించడంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా గిరిజనులకు ఇచ్చిన వాగ్దానాలను అమలుకు కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అన్ని గిరిజన, ఆదివాసీ సంఘాలతో ఐక్య కార్యచరణగా ఏర్పడి ప్రత్యేక పోరాటాలను నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

టోలీచౌకి, నానల్‌నగర్ డివిజన్‌లలో ఎమ్మెల్యే పర్యటన..

టోలీచౌకి, నానల్‌నగర్ డివిజన్‌లలో బుధవారం కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే.. స్థానికులతో పలు సమస్యలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అభివృద్ధి పనులు చేపట్టడానికి అధికారులు కృషి చేయాలన్నారు. – మెహిదీపట్నం ఆగస్టు 14

ప్రశాంతంగా గణేశ్ ఉత్సవాలను జరుపుకోవాలి

కాచిగూడ,ఆగస్టు 14: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు, మండపాల నిర్వాహకులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ సూచించారు. మండపాల నిర్వాహకులతో కాచిగూడ పీఎస్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని, ఈ నిబంధనలను మండప నిర్వాహకులు కచ్చితంగా పాటించాలని సూచించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మండపాలను నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. పోలీసులు సూచించిన పలు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. మండపాల వద్ద బాణాసంచా, పేలుడు పదార్థాలు పేల్చవద్దని, లౌడ్ స్పీకర్లు, డీజే లాంటి పరికరాలను వాడకుండా మండప నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా ఫోన్: 8712660540కు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్సై సుభాష్, మండపాల నిర్వా హకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి నిరోధక టీకాలు

గోల్నాక, ఆగస్టు 14 : అంబర్‌పేట డివిజన్, పటేల్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రమీల, ఆశవర్కర్లు విజయలక్ష్మి, శోభ , తదితరులు పాల్గొన్నారు

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

చిక్కడపల్లి,ఆగస్టు14 : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగాలు చేసిన మహనీయుల జీవితాలను యువతరం ఆదర్శంగా తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బీజేపీ పిలుపు మేరకు బుధవారం ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూజారాజు ఆధ్వర్యంలో గాంధీ నగర్ డివిజన్, అరుంధతి నగర్ బస్తీలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్ రామ్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కు మార్, ఓబీసీ మోర్చా ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ మెతుకు ఉమేశ్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, శైలేంద్ర శ్రీనివాస్, రాంగనర్ కార్పొరేటర్ రవిచారి, పీఎం చారి, నర్సింగ్ ప్రసాద్, శ్రీకాంత్, వీఎస్‌టీ రాజు, గంటా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిజాం కళాశాలకు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్

కార్వాన్, ఆగస్ట్14: నగరంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నిజాం కళాశాల అరుదైన ఘనత సాధించింది. జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేం వర్క్(ఎన్ఐఆర్ఎఫ్)లో 101–150 బ్యాండ్‌లో స్థానం సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ బి. భీమా మాట్లాడుతూ.. నిజాం కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకుందరికి ధన్యవాదాలు, శుభాకాంక్షలు తెలిపారు. స్థిరమైన ప్రయత్నాలు ఈ ముఖ్యమైన గుర్తింపుకు దోహదపడ్డాయన్నారు. ఈ ప్రాంతంలోని పురాతన, అత్యంత గౌరవనీయ సంస్థలలో ఒకటిగా ఉన్న నిజాం కళాశాల నాణ్యమైన విద్యతో పాటు ఆవిష్కరణల వారసత్వాన్ని కొనసాగిస్తుందని ప్రొ. భీమా పేర్కొన్నారు.

హెచ్‌సీఏ డివిజన్ లీగ్ పోటీల్లో
సత్తాచాటిన ఆకాంక్ష్

అంబర్‌పేట, ఆగస్టు 14: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఏ2 డివిజన్ రెండు రోజుల క్రికెట్ లీగ్‌లో అంబర్‌పేటకు చెందిన ఆటగాడు ఆకాంక్ష్ సీతారామన్ ఐదు వికెట్లు తీసి సత్తా చాటాడు. సిటీ కాలేజీ ఓల్డ్ బాయ్స్ వర్సెస్ ఛీర్‌ఫుల్ ఛాంప్స్ టీమ్‌ల మధ్య జరిగిన ఈ పోటీలో సిటీ కాలేజీ ఓల్డ్ బాయ్స్ 130 పరుగులతో విజయం సాధించింది. ఈ టీమ్ తరఫున బౌలింగ్ చేసిన ఆకాంక్ష్ సీతారామన్ 14 ఓవర్లలో నాలుగు మెయిడెన్ ఓవర్లు వేసి 34 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు తీశాడు. ఈ సందర్భంగా టీమ్ సభ్యులు, కోచ్ అతన్ని అభినందించారు.

బంగ్లాదేశ్ హిందువులకు
అండగా ఉంటాం..

తెలంగాణ బార్ కౌన్సిల్ ఫెడరేషన్ అధ్యక్షుడు రాజ్యవర్ధన్‌రెడ్డి

నాంపల్లి కోర్టులు, అగస్టు 14 (నమస్తే తెలంగాణ) : బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న హిందువులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, వారికి అండగా మేమున్నామని హామీ ఇస్తున్నట్లు తెలంగాణ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నాంపల్లి కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల సంఘీభావ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందువులపై జరుగుతున్న అమానవీయ దాడులను ప్రపంచమంతా ముక్తకంఠంతో ఖండించాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో విద్యార్థి ఉద్యమం మాటున అమాయకులైన మైనారిటీ హిందువులపై విచక్షణా రహితంగా దాడులు చేస్తున్నారని, ఈ దాడుల్లో హిందువులు తమ ఆస్తులతో పాటు, ప్రాణాలను సైతం కోల్పోతున్నారన్నారు. ఇలాంటి దాడుల నుంచి అక్కడి హిందువులకు రక్షణగా ప్రపంచంలోని ప్రతి మానవతావాది అండగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. వారికి అండగా నిలుస్తామని పెద్దెత్తున న్యాయవాదులు నినాదాలు చేశారు. భారత్‌తో పాటు ప్రపంచం నలుమూలల నుంచి బంగ్లా హిందువు లకు మద్దతు ప్రకటించాలని కోరారు. శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగాలో సైఫాబాద్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్‌లు

కార్వాన్‌లోని కుల్సుంపురా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జాతీయ జెండాలు అందజేసిన ఉపాధ్యాయులు, బీజేపీ నేతలు

హర్ ఘర్ తిరంగా ర్యాలీ.. జాతీయ జెండాల పంపిణీ

సుల్తాన్‌బజార్, ఆగస్టు 14 : మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్‌లు హర్ ఘర్ తిరంగాలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు బుధవారం కళాశాలలోని ఎన్‌సీసీ కార్యాలయం నుంచి చింతల్ బస్తీ మీదుగా నెక్లెస్ రోడ్‌లోని పీవీ నరసింహారావు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ శరత్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ పల్లాటి నరేశ్, ఎన్‌సీసీ క్యాడెట్‌లు పాల్గొన్నారు.

మెహిదీపట్నం రేతిబౌలిలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న సింధు మహిళా కళాశాల విద్యార్థినులు

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

కార్వాన్, ఆగస్ట్ 14: ప్రతి భారతీయ పౌరుడు తమతమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని గుడిమల్కాపూర్ డివిజన్ బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన హర్ ఘర్ తిరంగా పిలుపు మేరకు బుధవారం ఆయన కార్వాన్‌లోని కుల్సుంపురా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జాతీయ జెండాలు పంపిణీ చేశారు. అనంతరం శివ్‌బాగ్ చౌరస్తాలో జాతీయ జెండాలను పంచి పెట్టారు. అ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనంత క్రిష్ణ, శ్రీకాంత్ సాగర్, సందేశ్ యాదవ్, ముఖేశ్ సాగర్, నామా యాదగిరి నేత, సుధాకర్ యాదవ్, రఘు, విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మెహిదీపట్నంలో ..

మెహిదీపట్నం ఆగస్టు 14 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మెహిదీపట్నం రేతిబౌలిలో సింధు మహిళా కళాశాల విద్యార్థినులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు రామారావు, అధ్యక్షుడు వెంకటా చలపతి ,డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.ప్రమీల రాణి, వైస్ ప్రిన్సిపాల్ పి.నాగేంద్రుడు పాల్గొన్నారు.

జియాగూడలో జాతీయ పతాకాల పంపిణీ..

కార్వాన్, ఆగస్టు14 : భారత 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హర్ ఘర్ తిరంగా పిలుపు మేరకు బుధవారం జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జాతీయ పతాకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

శివ్‌బాగ్ చౌరస్తాలో ప్రజలకు జాతీయ జెండాలు పంపిణీ చేసిన బీజేపీ నేతలు శ్రీకాంత్ సాగర్, వంశీ, సందేశ్‌యాదవ్, ముఖేష్

యువతలో జాతీయ సమైక్యతను పెంపొందించాలి

కాచిగూడ, ఆగస్టు 14: దేశ వ్యాప్తంగా ఉన్న యువత లో జాతీయ సమైక్యతను పెంపొందించి, స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రలను యువతకు తెలియజే యాల్సిన అవసరం ఉందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ నాయకత్వంలో బుధవారం బర్కత్‌పుర చౌరస్తాలో జెండా తిరంగ్ ర్యాలీని విద్యార్థులతో కలిసి భారీ ఎత్తున నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ ..దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏండ్లు కావస్తున్నా ఇప్పటికి దేశంలోని 80 కోట్ల బీసీల బతుకులు మరలేదని అన్నారు. చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు, ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్, రాజ్‌కుమార్,జయంతిగౌడ్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

అంకిత(ఫైల్)

అబిడ్స్, ఆగస్ట్14: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. ఈ సంఘటనలు మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ ప రిధిలో చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఇం దిరానగర్‌కు చెందిన జి.అంకిత(37) ఈ నెల 14న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో స్థానికంగా వెతికినా, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరానగర్‌లో యువకుడు..

ఆంజనేయులు(ఫైల్)

ఇందిరానగర్‌కు చెందిన కప్పరి ఆంజనేయులు(24) ఆగస్టు 8న ఇంట్లో నుండి బయటకు వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో బాలుడి తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కాచిగూడ,ఆగస్టు 14: స్వచ్ఛంద సంస్థలు పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించినప్పుడే తగిన గుర్తింపు ఉంటుందని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్ యాదవ్ అన్నారు. కోఠి దవాఖాన ఆధ్వర్యంలో కుద్బిగూడలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం డివిజన్‌లో స్వచ్ఛంద సంస్థలు విరివిరిగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో వ్యాక్సినేషన్, బీపీ, షుగర్, కంటి, దంత, తదితర పరీక్షలు దాదాపు 250 మందికి డాక్టర్లతో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, డాక్టర్లు సాయిబాబా, మనోజ్‌రొరెడ్డి, ధర్మారెడ్డి, సంతోశ్,మల్లికార్జున్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగలు అరెస్ట్

కాచిగూడ,ఆగస్టు 14: సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా,ఎమ్మాగనూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు మాచర్ల తిమ్మప్ప(33), ఎన్‌టీఆర్ జిల్లా మైలారం ప్రాంతానికి చెందిన రామకృష్ణ కుమారుడు సాయిరఘవ(34)ఇద్దరు జులాయిగా తిరుగుతూ రద్దీగా ఉండే రైల్వేస్టేషన్‌లలో సెల్‌ఫోన్‌లను దొంగలిస్తుంటారు. వారం రోజుల క్రితం వివిధ రైల్వేస్టేషన్‌లలో ఖరీదైన సెల్‌ఫోన్‌లను దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. బుధ వారం కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. సెల్‌ఫోన్ల దొంగతనం బయటపడింది. వారి నుంచి 9 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా శ్రీనాథ్ ఎన్నిక

నాంపల్లి కోర్టులు, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ) : న్యాయవాదుల పరస్పర సహకార సంఘం అధ్యక్షుడిగా పిల్లరిశెట్టి శ్రీనాథ్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని బుధవారం సిటీ సివిల్ కోర్టులోని ప్రధాన కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్ మణికొండ, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్ తడకంటి, సంయుక్త కార్యదర్శిగా మహేశ్వర్ అర్ముల, కోశాధికారిగా గిరి తోర్నాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నుకోబడిన సభ్యులకు తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యులు కొంతం గోవర్దన్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.